అక్రమ కేసులే అజెండా..?

సచివాలయం వద్ద టీడీపీ జెండా



రాయలచెరువు సచివాలయం వద్ద ఎగురవేసిన టీడీపీ జెండా

యాడికి, జనవరి 16: మండల పరిధిలోని రాయలచెరువు గ్రామ సచివాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు వైసీపీ జెండాను తొలగించి, టీడీపీ జెండాను ఎగురవేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నెల క్రితం రాయలచెరువు సచివాలయం వద్ద వైసీపీ నాయకులు పార్టీ జెండాను ఎగురవేశారు. సచివాలయం గ్రామానికి దూరంగా, పొలాల మధ్య ఉంది. రెండో శనివారం, ఆదివారం, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అటువైపు వెళ్లలేదు. ఇదే అదనుగా కొందరు వైసీపీ జెండాను తొలగించి టీడీపీ జెండాను ఎగురవేశారు. పొలాల వద్దకు వెళుతున్న రైతులు సోమవారం గమనించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గ్రామ పంచాయతీ అధికారులు టీడీపీ జెండాను తొలగించి, తిరిగి వైసీపీ జెండాను ఏర్పాటు చేశారు. టీడీపీవారే ఈ పని చేసి ఉంటారని వైసీపీ నాయకులు అంటున్నారు. పోలీసుల అనుమానమూ టీడీపీవారిపైనే ఉంది. కానీ తమపై అక్రమ కేసులు బనాయించేందుకు వైసీపీవారే ఇలా చేసి ఉంటారని టీడీపీ నాయకులు అంటున్నారు. రాయలచెరువు టీడీపీ నాయకులు గత నాలుగున్నరేళ్లుగా తాడిపత్రి నియోజకవర్గంలో అత్యంత చురుగ్గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే వారిపై రెండంకెల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. మరిన్ని ఎక్కువ కేసులు నమోదు చేయాలని దురుద్దేశంతో తమ పార్టీ జెండా ఎగురవేసి ఉంటారని టీడీపీ నాయకులు అనుమానిస్తున్నారు. తాము అనుకుంటే గ్రామ నడిబొడ్డున జెండా ఎగురవేస్తామని, దొంగచాటుగా ఎగురవేయాల్సిన ఖర్మ తమకు పట్టలేదని టీడీపీ నాయకులు అన్నారు. రెండు పార్టీలవారి మధ్య చిచ్చు రేపేలా ఉన్న ఈ వ్యవహారంపై పోలీసులు విచారించాలని, బాధ్యులను గుర్తించిచర్యలు తీసుకోవాలని వైసీపీ, టీడీపీ నాయకులు డిమాండ్ చేయడం గమనార్హం.

వైసీపీకి షర్మిల గుబులు





కాంగ్రెస్‌లోకి చేరికలు పెరిగే అవకాశం

అసమ్మతి నేతలకు ప్రత్యామ్నాయ వేదిక

ఇప్పటికే సిద్ధమైన రాయదుర్గం ఎమ్మెల్యే కాపు

మరికొందరు అధికార పార్టీ నాయకులు కూడా..?

అనంతపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిలకు పీసీసీ అధ్యక్ష పగ్గాలు అప్పగించడంతో వైసీపీకి గుబులు పట్టుకుంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మార్పుతో ఆ పార్టీ ముఖ్యులు ఇప్పటికే అసంతృప్తితో రగిలిపోతున్నారు. బాహాటంగానే ధిక్కారస్వరాన్ని వినిపిస్తున్నారు. ఆ పార్టీ శ్రేణులు సైతం ఇదే తరహాలో స్పందిస్తున్నారు. షర్మిల పీసీసీ అధ్యక్షురాలు కావడంతో వైసీపీ అసంతుష్ట నేతలు ప్రత్యామ్నాయ వేదికగా కాంగ్రెస్‌ను ఎంచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైసీపీలో టికెట్లు ఆశించి భంగపడేవారు కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో కొందరు నాయకులు వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. షర్మిల పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన వెంటనే కాంగ్రెస్‌లో చేరేందుకు కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారని ఆయా నాయకుల సన్నిహితులు అంటున్నారు. రాష్ట్ర విభజన తరువాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ వరుస ఓటములను ఎదుర్కొంటోంది. అసెంబ్లీలో ప్రాతినిధ్యం కోల్పోయింది. పీసీసీ అధ్యక్షులను మార్చినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో ఏపీలోనూ బలాన్ని పెంచుకోవాలని ఆ పార్టీ చూస్తోంది. ఈ క్రమంలో ఎన్నికలకు ముందు టీ కాంగ్రెస్‌కు షర్మిల మద్దతు తెలిపారు. ఎన్నికల తరువాత టీవైసీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. తాజాగా షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిగా ప్రకటించారు.

కాంగ్రెస్ గూటికి కాపు..?

రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి స్థానంలో ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందురెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వైసీపీ నియమించింది. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి ప్రత్యామ్నాయంగా మరో నియోజకవర్గాన్ని కూడా కేటాయించలేదు. తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకుని, టికెట్ లేదని మొహం మీదే చెప్పేశారు. దీంతో ఆయన అక్కడే తన ఆక్రోశాన్ని వెల్లగక్కారు. వైఎస్ కుటుంబాన్ని నమ్మినందుకు గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక జగన్‌కు సెల్యూట్ అంటూ తనదైన శైలిలో ధిక్కారస్వరాన్ని వినిపించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీ టికెట్ ఇస్తే... ఆ పార్టీ తరుఫున, లేదంటే తాను కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి, తన కుటుంబ సభ్యులు రాయదుర్గం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉంటామని అదే సందర్భంలో ప్రకటించారు. దీన్నిబట్టి చూస్తే... ఆయన ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను చూసుకుంటున్నారన్నది తేటతెల్లమవుతోంది. వైఎస్ కుటుంబాన్ని నమ్ముకుని రాజకీయాల్లోకి వచ్చిన కాపు రామచంద్రారెడ్డి, ఆయన కూతురు వైఎస్ షర్మిలకు పీసీసీ పగ్గాలు అప్పగించిన నేపథ్యంలో కాంగ్రెస్ గూటికి వెళ్లే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డిని ఆయన కలిశారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అతిత్వరలో కాంగ్రెస్ పార్టీలోకి ఆయన చేరడం ఖాయమని కాపు సన్నిహితులు అంటున్నారు. ఆయనతో పాటు రాయదుర్గం నియోజకవర్గంలోని మరికొంత మంది వైసీపీ నాయకులు కాంగ్రెస్‌లోకి వెళతారని సమాచారం.



వైసీపీపై షర్మిల ప్రభావం

పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలను నియమించిన నేపథ్యంలో ఆ ప్రభావం వైసీపీపై అధికంగా ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వైసీపీలో టిక్కెట్ దక్కనివారు, ఇప్పటి వరకూ ప్రాధాన్యం లభించనివారు పార్టీని వీడే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరీ ముఖ్యంగా అధికార పార్టీ సామాజికవర్గంలో చీలికలకు తావుటుందని అంటున్నారు. ఆ సామాజికవర్గం నేతల్లో ఇప్పటికే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వైఎస్ షర్మిల రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలు చేపడితే... అధికార వైసీపీలోని అసంతృప్తితో రగిలిపోతున్న ఆ సామాజికవర్గం నేతలు కొందరు షర్మిల పక్షాన నిలిచే పరిస్థితులు లేకపోలేదు. ఆ ప్రభావం సార్వత్రిక ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని వైసీపీలోని కొందరు నేతలు చెబుతుండటం గమనార్హం. వైసీపీలో ఎమ్మెల్యేలకు తప్ప, ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని ఎక్కడా ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ఈ పర్యవసానాలే వారిని తమ పార్టీకి దగ్గర చేస్తాయనే భావన కాంగ్రెస్ నాయకుల్లో ఉంది. పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, శైలజనాథ్ ఇద్దరూ జిల్లావాసులే. వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో వారికి సంబంధాలు ఉన్నాయి. ఇవన్నీ కాంగ్రెస్‌లో చేరికలకు కలిసొచ్చే అంశాలని చెబుతున్నారు. షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడం వైసీపీలో ప్రకంపనలు రేపుతోంది. పీసీసీ చీఫ్‌గా షర్మిల ప్రమాణస్వీకారం చేసిన అనంతరం వైసీపీలోని అసంతుష్టులు ఒక్కొక్కరిగా కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

శ్రీరాముడి స్ఫూర్తితో పాలన

ప్రధాని నరేంద్ర మోదీ లేపాక్షి ఆలయ సందర్శన

నాసిన్ క్యాంపస్‌కు శ్రీకారం



శ్రీరాముడి స్ఫూర్తితో పరిపాలన సాగిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన.. చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం.. లేపాక్షిని సందర్శించారు. అత్యాధునిక శిక్షణా కేంద్రం నాసిన్‌ను ప్రారంభించారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ మోదీ రామనామ జపమే చేశారు. లేపాక్షి వీరభద్రుడి ఆలయంలో గంటకుపైగా గడిపారు. పూజ, ధ్యానం, సాంస్కృతిక ప్రదర్శనల వీక్షణతో పులకించిపోయారు. వీరభద్రుడికి స్వయంగా హారతి పట్టారు. నిమ్మలకుంట తోలుబొమ్మల కళాకారులు 'లేపాక్షి' ఇతివృత్తాన్ని తెలియజేసే రామాయణ ఘట్టాన్ని ఆలయంలో ప్రదర్శించారు. రంగనాథ రామాయణంలోని శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ సంకీర్తనలు వినిపించారు. లేపాక్షి ఆలయ శిల్పకళా సంపదను తనివితీరా వీక్షించారు. అద్భుతమని కొనియాడారు. అనంతరం గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని నాసిన్ అకాడమీని ప్రారంభించారు. రామరాజ్యంలో పన్నుల వ్యవస్థ గురించి తులసీదాసు వివరించారని ప్రధాని ప్రస్తావించారు. ఆ స్ఫూర్తితోనే జీఎస్టీని తెచ్చామని అన్నారు. 'పరిపాలనా దక్షతకు రాముడు మారుపేరు. అక్రమంగా దక్కే అధికారాన్ని స్వీకరించొద్దని రాముడు చెప్పారు. అధర్మ మార్గంలో వచ్చేది ఇంద్రప్రస్థమైనా అక్కర్లేదని రాముడు అన్నారు' అని ప్రధాని గుర్తుచేశారు. తాను ఎల్లప్పుడూ ధర్మం పక్షానే నిలుస్తానని రాముడు చెప్పారనీ, రామరాజ్యభావన నిజమైన ప్రజాస్వామ్యమని గాంధీ చెప్పారని గుర్తు చేశారు. తాను కూడా అధర్మంగా అధికారం దక్కితే స్వీకరించనని అన్నారు. దేశమంతా ఇప్పుడు రామమయం అయ్యిందని పరోక్షంగా అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను ప్రస్తావించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. లేపాక్షి, పాలసముద్రం మార్గంలో దారికి ఇరువైపులా ప్రజలు నిలబడి ప్రధానికి అభివాదం చేశారు. (వివరాలు మెయిన్, 7లో..)

దర్జాగా రేషన్ దందా

ముడుపులతో అధికారుల మౌనం



బొమ్మనహాళ్ మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు అధికారులకు ముడుపులు అందుతుండటంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రం నుంచి విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టి దాడులు జరిపితే తప్ప, ఇక్కడ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. రెండు వారాల వ్యవధిలోనే పెట్టుబడికి రెట్టింపు ఆదాయం లభిస్తుండడంతో చాలా మంది రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పూనుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకూ గుట్టు చప్పుడు కాకుండా జరిగిన ఈ వ్యాపారం.. అధికారుల అవినీతి కారణంగా బహిరంగంగానే సాగుతోంది. దర్గాహొన్నూరుకు చెందిన ఓ వ్యక్తి అధికార పార్టీ నాయకుల అండతో మండలంలో జోరుగా బియ్యం దందా సాగిస్తున్నారు. సేకరించిన బియ్యం తనకే ఇవ్వాలని, లేకపోతే పోలీసులకు పట్టిస్తానని గ్రామాలలో బియ్యం సేకరించే వారిని బెదిరిస్తున్నట్లు సమాచారం. రెవెన్యూ, పోలీసు అధికారులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. నిల్వ ఉన్న బియ్యాన్ని అధికారులు పట్టుకుంటే, కేసు లేకుండా చూసుకుంటానని బియ్యం సేకరించే వారికి అభయమిస్తున్నట్లు సమాచారం. దీంతో కిలోకు రెండు, మూడు రూపాయలు తక్కువైనా, అతనికే బియ్యం సేకరించి ఇస్తున్నారని తెలిసింది. ఇలా సేకరించిన బియ్యాన్ని కర్ణాటకలోని చెళ్లకెర, తుమకూరు ప్రాంతాల్లోని రైస్‌మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు. మండలం నుంచి నెలకు సగటున రూ.10 లక్షల విలువైన రేషన్ బియ్యం తరలుతోందని సమాచారం. వ్యాపారులకు దీనికి రెట్టింపు ఆదాయం వస్తోందని అంటున్నారు. రేషన్ బియ్యం కిలో రూ.8 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేసే స్థానిక వ్యాపారులు అదనంగా రూ.5 తీసుకుని అక్రమార్కులకు అమ్ముతున్నారు. కర్ణాటకలో ఈ బియ్యాన్ని కిలో రూ.20 నుంచి రూ.25 ప్రకారం కొంటున్నారు. మామూళ్లు, రవాణా ఖర్చులు పోనూ భారీగా మిగులుబాటు ఉంటోంది.



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్‌బియ్యం (ఫైల్)

- బొమ్మనహాళ్

సమ్మె శిబిరానికి నిప్పు

అంగన్‌వాడీల ఆందోళనపై అక్కసు

కలెక్టరేట్ ఎదుట ఘటన.. పోలీసులకు ఫిర్యాదు .. 36వ రోజు కొనసాగిన ఆందోళనలు



కలెక్టరేట్ వద్ద మట్టి తింటూ అంగన్‌వాడీల నిరసన



అనంతపురం విద్య, జనవరి 16: అంగన్‌వాడీల సమ్మెపై ద్వేషాన్ని ప్రదర్శించారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్నవారిపై అక్కసు వెళ్లగక్కారు. ఏకంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన షామియానాకు నిప్పు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు 36 రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని, దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ శిబిరానికి మంగళవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గుర్తించి మంటలను ఆర్పి వేశారు. సమ్మె శిబిరంలో సుమారు 60 అడుగుల మేర షామియానాలు వేశారు. స్థానికులు సకాలంలో మంటలను ఆర్పకపోతే శిబిరం మొత్తం కాలిపోయేది. శిబిరానికి కేవలం 15 అడుగుల దూరంలో అనేక పూరి గుడిసెలు, షెడ్లు, నివాస గృహాలు ఉన్నాయి. కలెక్టరేట్ ఎదుటే ఈ ఘటన చోటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. సమ్మె గిట్టనివారే ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఆకతాయిలు ఈ పనిచేసి ఉంటారని మరికొందరు అంటున్నారు. ఈ ఘటనపై సీఐటీయూ నాయకులు వెంకట నారాయణ, రామాంజినేయులు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జమున, అరుణ తదితరులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. సీఐ అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేసి వివరాలు తెలియజేశామని అన్నారు. విచారిస్తామని తెలిపారని అన్నారు.

36వరోజూ ఆందోళన

సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద రోడ్డుపై అంగన్‌వాడీలు మట్టి తింటూ నిరసన వ్యక్తం చేశారు. నేలపై కూర్చొని, మూకట్లలో మట్టి గడ్డలు పెట్టుకుని 'మట్టి తిని బతకాలా..?' అని నినాదాలు చేశారు. సమ్మెపై సీఎం జగన్ స్పందించాలని, వెంటనే వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా గుర్తించాలని కోరారు. లేకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పట్టా స్థలంపై కన్ను



పట్టా చూపుతున్న లింగమ్మ

ఎక్కడా స్థలం దొరకనట్లు.. పరకలు అమ్ముకుని బతికే పేద మహిళ స్థలంపై కన్నేశాడు అధికార పార్టీ కార్యకర్త. అధికారులు చెప్పినా, చివరకు అధికార పార్టీ ఎమ్మెల్యే చెప్పినా వినడంలేదని బాధితురాలు వాపోతున్నారు. గుంతకల్లు ఉమామహేశ్వర నగర్‌కు చెందిన ఎరుకుల లోకేశ్, ఎరుకుల లింగమ్మ దంపతులకు 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం ఇచ్చింది. పక్కా ఇల్లు మంజూరైనా, కట్టుకునేలోగా ప్రభుత్వాలు మారిపోయాయి. ఆ ఇల్లు పునాదికే పరిమితమైంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక తమదే ఆ స్థలం అంటూ ఆ పార్టీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగుతున్నారు. ఏడాది క్రితం వైసీపీ కార్యకర్త గోపాల్ తనదే ఆ స్థలమని పునాదులను తొలగించాడు. బాధితులు రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గడప గడపకు వచ్చిన ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. 'మీ స్థలంలో మీరు ఇల్లు నిర్మించుకోండి' అని ఎమ్మెల్యే సూచించారు. కానీ అట్ల బేస్‌మెంట్ వేయగానే ఇట్ల గోపాల్ వచ్చి తొలగిస్తున్నాడని బాధితులు వాపోతున్నారు. లింగమ్మ పేరిట పట్టా ఉందని, అది ఆమె స్థలమేనని తహసీల్దారు కూడా అంటున్నారని బాధితులు తెలిపారు. పట్టాను రెన్యువల్ చేసుకున్నామని, కరెంట్ మీటర్ బిగించామని, ఖాళీ స్థలానికి పన్ను కూడా చెల్లించామని అంటున్నారు. ఎన్నుంటే ఏంచేయగలరు..? అటువైపు ఉన్నది అధికార పార్టీవారు. దీనిపై విచారణ జరిపిస్తామని తహసీల్దారు ప్రతాప్‌రెడ్డి అన్నారు.

- గుంతకల్లు టౌన్

టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసు

గుమ్మఘట్ట, జనవరి 16: మండలంలోని బేలోడు గ్రామంలో రెండు రోజుల క్రితం టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన 17 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయి. వైసీపీకి చెందిన ఎస్సీ రామాంజనేయులు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ పోస్టర్‌ను చూసి టీడీపీ నాయకులతో ఘర్షణకు దిగాడు. దీంతో టీడీపీకి చెందిన బోయ సంజీవతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగడంతో టీడీపీ కార్యకర్తలు 17 మందిపై గుమ్మఘట్ట ఎస్‌ఐ సునీత ఎస్సీ, ఎస్టీ కేసును నమోదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. తమ కార్యకర్తలను భయపెట్టేందుకు అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకునేది లేదంటూ టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఈ సంఘటనపై గుమ్మఘట్ట ఎస్‌ఐ సునీతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ రిసీవ్ చేయలేదు.

శ్రీరంగ రంగా..!

జేఎన్‌టీయూకి అవినీతి మరక..!



జేఎన్‌టీయూ ముఖద్వారం

- ఉన్నతాధికారిపై అక్రమాల ఆరోపణలు
- బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ముడుపులు
- అభివృద్ధి పనుల్లో పర్సెంటేజీలు
- వసూళ్లకు ప్రత్యేక పీఏ నియామకం
- మండిపడుతున్న విద్యార్థి, ఉద్యోగ వర్గాలు

సాంకేతిక విద్యాకేంద్రం జేఎన్‌టీయూ అక్రమాలకు నిలయంగా మారిందని ఉద్యోగ, విద్యార్థి వర్గాలు మండిపడుతున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారి ప్రత్యేకంగా ఒక పీఏను నియమించుకుని వసూళ్ల దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పేషీగా పనిచేసిన ఉద్యోగిని బదిలీ చేసిన ఉన్నతాధికారే మళ్లీ అదేపేషీలోకి వర్సిటీ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ద్వితీయ పీఏగా నియమించుకోవడం పట్ల తీవ్ర అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారదర్శకంగా పనిచేసేవారిని ఉన్నఫలంగా బదిలీ చేయడం. ఆమ్యామ్యాలిచ్చే వారికి మినహాయింపు ఇవ్వడం ఇక్కడ పరిపాటిగా మారిందని విమర్శలున్నాయి. ముడుపులు చెల్లించనిదే ప్రమోషన్‌ల ఫైలు కదలదని ఆయా వర్గాలు వాపోతున్నాయి. విద్యార్థులు ఫీజు రూపంలో చెల్లిస్తున్న మొత్తాలతో సాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు తిలోదకాలిచ్చినా పర్సెంటేజీలు తీసుకుని సంతకాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈక్రమం లో ఈనెల 17న పదవిలోనుంచి దిగిపోయిన అనంతరం తన అవినీతి బయటపడుతుందే మోనన్న భయంతో ఆ ఉన్నతాధికారి కలికిరి ఇంజనీరింగ్ కళాశాలలలో ప్రొఫెసర్‌గా పని చేయడానికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్‌ను సిద్ధం చేసుకున్నట్లు వర్సిటీ వర్గాల సమాచారం. - అనంతపురం సెంట్రల్

అక్రమాల చిరునామా..



సాంకేతిక వనంలాంటి జేఎన్‌టీయూను ఐదేళ్లలో అక్రమాలకు చిరునామాగా మార్చేశారు. ఒక వర్గం రాష్ట్రస్థాయిలో, ఇంకోవర్గం వర్సిటీలో అక్రమాల పర్వాన్ని సాగిస్తున్నారు. టీడీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు నేటికీ సంపూర్ణంగా పూర్తిచేయలేదు. అర్హత, అనుభవం ఆధారంగా ప్రమోషన్‌లు, ట్రాన్స్‌ఫర్‌లు చేపట్టలేదు. వీసీగా రంగజనార్దన ప్రతి పనికి ఒక రేటు పెట్టాడు.

- పరశురాం, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

● రూ.లక్షల్లో ముడుపులు..



బదిలీల అంశంలో ఉన్నతాధికారి నియంతలా వ్యవహరించారని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. ఎవరిని ఎప్పుడు ఎక్కడికి బదిలీ చేస్తారోనన్న భయంతో నిత్యం వణికిపోయినట్లు వాపోతున్నాయి. వర్సిటీ పరిధిలోని అనంతపురం, కలికిరి, పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలతో పాటు ఓటీపీఆర్ఐ, వర్సిటీ ఎగ్జామినేషన్ సెంటర్, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ఈ ఆరింటిలో ఉద్యోగులను ఒక చోటనుంచి మరోచోటుకు బదిలీ చేస్తుంటారు. అనంతపురం జిల్లా కేంద్రం కావడంతో స్థిరనివాసాలు, పిల్లల చదువులు ఇలా అన్ని ఇక్కడే జరిగిపోతుంటాయి. దీంతో ఇక్కడే ఉండేందుకు చాలామంది ఉద్యోగులు ఆసక్తి చూపుతారు. దీన్ని అవకాశంగా తీసుకుని పులివెందుల, కలికిరికి బదిలీ చేయడం ముడుపులు పుచ్చుకుని తిరిగి అనంతపురానికి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. సీఏఎస్ పేరుతో ఉద్యోగోన్నతులు కల్పించేందుకు అడ్డదారులు తొక్కారని మండిపడుతున్నాయి.

దోచుకోవడమే లక్ష్యం



పదవులు పొందేందుకు రాజకీయ నాయకులకు చెల్లించిన ముడుపుల మొత్తాన్ని తిరిగి వసూలు చేసుకోవడానికి విద్యార్థుల సొమ్ము దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఫ్యాకల్టీలో ఏ ఒక్కరికి సిఫార్సులు, ముడుపులు లేకుండా పదవులు వరించడంలేదు. అభివృద్ధి పనులను కూడా పర్సెంటేజీలతో నడిపిస్తున్నారు. వర్సిటీ ఉన్నతాధికారి ఈ మూడేళ్లలో సాగించిన అక్రమాలే ఇందుకు నిదర్శనం.

- వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

● పర్సెంటేజీల వ్యాపారం...

టీడీపీ పాలనలో దాదాపు రూ.500కోట్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టారు. లెక్చరర్ హాల్, ఫార్మసీ బిల్డింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, అకడమిక్ బిల్డింగ్, ఇండోర్ స్టేడియం వంటి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు దక్కించుకున్నా సబ్ కాంట్రాక్ట్ పేరుతో ఒక కాంట్రాక్టర్ మాత్రమే అత్యధిక పనులు చేస్తున్నారు. పనులు దక్కించుకునేది ఎవరైనా.. జేఎన్‌టీయూలో పనిచేసేది, చేయాల్సింది తానేనన్న ధోరణితో దశాబ్దాలుగా ఆ కాంట్రాక్టర్ పాగావేశారు. దీని వెనుక ముడుపుల కథ ఉందనే విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రతి పనికీ పర్సెంటేజీల్లేకుండా సంతకాలు కావడంలేదని సమాచారం. టెండర్ అంచనాలకు మించి అధిక మొత్తంలో, అడ్డదారుల్లో నిధులు కట్టబెట్టడమే ఇందుకు నిదర్శనమని వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. విద్యార్థుల నుంచి ఫీజుగా వసూలు చేసిన సొమ్మును ఎలా ధారపోస్తారని ప్రశ్నిస్తే.. పాపం కాంట్రాక్టర్లు అంటూ వారిపైనే సానుభూతి చూపుతున్నారని మండిపడుతున్నాయి.

పనికి ఆహార పథకంలా..



జేఎన్‌టీయూని పనికి ఆహార పథకంలా మార్చిన వైసీపీ ప్రభుత్వం.. అధికారులు అడ్డంగా దోచుకునేందుకు రెడ్ కార్పెట్ పరిచింది. బదిలీలు, ప్రమోషన్‌లకు లంచాలు. అభివృద్ధి పనులకు పర్సెంటేజీలు తీసుకుంటు న్న వర్సిటీ ఉన్నతాధికారే ఇందుకు నిదర్శనం. వైసీపీ నాయకుడి సిఫార్సుతో పదవిని పొందిన ఆయన అందుకు చెల్లించిన ముడుపుల ను మూడేళ్లుగా వసూలు చేస్తున్నాడు.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సీతయ్యను తలపించాడు



ఉన్నతాధికారిగా వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక అధికారాలను ఉపయోగించే అధికారం ఉంటుంది. అయితే ఈ ఉన్నతాధికారి మాత్రం తన స్వాభివృద్ధి కోసం ఉద్యోగ, సిబ్బందిపై పడుతూ సీతయ్యను తలపించాడు. కార్యాలయంలో రూపొందించాల్సిన బదిలీల ఆర్డర్లను ఇంట్లో తయారు చేసి జారీచేశారు. అడ్డదిడ్డంగా బదిలీలు, ప్రమోషన్‌లు చేస్తూ జేబులు నింపుకున్నాడు.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అంతా పారదర్శకంగానే..

పాదర్శకంగా పని చేసినా కొన్నిశక్తులు ఆరోపణలు చేస్తుంటాయి. వాటిని పట్టుకుంటే పనిచేయలేము. ఓటీపీఆర్ఐతోపాటు పులివెందుల, కలికిరి, అనంతపురం ఇంజనీరింగ్ కళాశాలున్నాయి. వీటిలో పనిచేస్తున్న వారికి అర్హత ఆధారంగా ఉద్యోగోన్నతులు, సర్వీసుమేరకు బదిలీలు చేశా. గత ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు వేగవంతంచేసి వినియోగంలోకి తీసుకువచ్చా. స్కిల్‌డెవలప్‌మెంట్, ఇండోర్ స్టేడియం భవనాలను మాత్రమే ప్రారంభించాల్సి ఉంది. పూర్వ విద్యార్థుల సహకారంతో అనేక సదుపాయాలను కల్పించాం. పేషీ పనుల నిమిత్తం సునీల్‌కుమార్‌ను రెండో పీఏగా నియమించామంతే. అఫిలియేషన్ కళాశాలలు వర్సిటీ నిబంధనలు పాటించి నాణ్యమైన విద్యనందించేలా చర్యలు తీసుకున్నా. ఈ క్రమంలో డబ్బులు వసూలు చేశారని, పర్సెంటేజీలు లేకుండా సంతకాలు చేయరని ఇలా ఏదేదో చెబుతుంటారు.



- ప్రొఫెసర్ రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ

స్వాగతం మోదీ జీ..(ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్)





ప్రధాని మోదీకి సీఎం జగన్ స్వాగతం



ప్రధానికి గవర్నర్ సత్కారం



అదిగో.. మోదీ..

ఎన్నెన్నో ప్రత్యేకతల అనంత

ప్రధానమంత్రి మోదీ లేపాక్షి ఆలయ సందర్శన నాసిన్‌కు శంకుస్థాపన



హిందూపురం, జనవరి 16: అనంత ఎన్నెన్నో ప్రత్యేకతల నిలయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలో ప్రధాని పర్యటించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన, శిల్పకళా నిలయమైన లేపాక్షి దుర్గావీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారి పక్కనే ఏర్పాటైన నాసిన్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు, మాదక ద్రవ్యాల నియంత్రణ జాతీయ అకాడమీ)ని ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ ప్రాంతం ఆధ్యాత్మికత, దేశ నిర్మాణం, సుపరిపాలనతో ముడిపడి ఉందన్నారు. దేశ వారసత్వ సంపదకు ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. పుట్టపర్తి సత్యసాయి బాబా ఈ ప్రాంతంలోనే జన్మించారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు కల్లూరు సుబ్బారావు ఈ ప్రాంతంవారేనన్నారు. ప్రఖ్యాత తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు ఈ ప్రాంతంవారేనన్నారు. విజయనగర రాజుల సుపరిపాలనకు ఈ ప్రాంతం వేదికైందని కొనియాడారు. ఇవన్నీ ఈ ప్రాంత స్ఫూర్తిదాయక విశేషాలన్నారు. నాసిన్ కూడా సుపరిపాలనకు కేంద్రబిందువు అవుతుందని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో వాణిజ్యం, పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు.

ఆలయ సందర్శన

జిల్లా పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ తొలుత లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ చరిత్ర, శిల్పసంపద గురించి గైడ్‌లు, అధికారులు.. ప్రధానికి వివరించారు. దుర్గాదేవి, వీరభద్రస్వాములను ప్రధాని దర్శించుకున్నారు. స్వయంగా హారతి ఇచ్చారు. అక్కడే ధ్యానం చేసి, శ్లోకాలు పఠించారు. భక్తులతో కలిసి భజన చేశారు. తోలుబొమ్మలాటలను తిలకించారు. ఆలయ అర్చకులు, తోలుబొమ్మల కళాకారులను ప్రధాని సత్కరించారు. అక్కడి నుంచి బయల్దేరి ప్రత్యేక హెలికాప్టర్‌లో నాసిన్‌కు చేరుకున్నారు. నాసిన్ క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రజలనుద్దేశించి మాట్లాడారు. క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్ అధికారులతో ఫొటోలు దిగారు. తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. ప్రధాని పర్యటనకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



నాసిన్ ప్రారంభోత్సవ వేదికపై ప్రధాని, గవర్నర్, సీఎం, కేంద్ర మంత్రులు, అధికారులు



విమానం దిగి.. చాపర్‌లో..

ప్రధాని మోదీ పర్యటన వివరాలు

హిందూపురం అర్బన్, జనవరి 16: ప్రధాని నరేంద్రమోదీ పుట్టపర్తి విమానాశ్రయము నుంచి లేపాక్షికి వచ్చిన విమానం 1.30 నిముషాలకు ల్యాండ్ అయ్యింది. అక్కడ నుంచి 1.35 గంటలకు రోడ్డు మార్గంలో ఆలయానికి చేరుకుని దుర్గా వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. 2.56కు ఆలయం నుంచి బయలుదేరి హెలికాప్టర్ వద్దకు వెళ్ళారు.

● ప్రధాని మోదీ రాకతో లేపాక్షి మొత్తం పోలీసుల వలయంలో చిక్కుకున్నట్లయ్యింది. ఎన్టీఆర్ విగ్రహం వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు వేసి ప్రజల సంచారాన్ని నిలిపివేశారు. అదే విధంగా చిలమత్తూరు వైపు నంది విగ్రహం అవతల వైపు బారికేడ్లతో అడ్డుకున్నారు. మిద్దెలమీద కూడా ఎవరినీ ఉండకుండా భారీ బందోబస్తు చేపట్టారు.



ప్రధాని కాన్వాయ్.. భద్రత



నాసిన్ వద్ద భద్రత



ప్రారంభోత్సవానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

పటిష్ఠ భద్రత నడుమ

గోరంట్ల, జనవరి 16: ప్రధాని నరేంద్రమోదీ లేపాక్షి పర్యటన పటిష్ఠ భద్రత నడుమ కొనసాగింది. మంగళవారం ప్రధాని లేపాక్షి ఆలయ సందర్శనతో పాటు గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద నాసిన్ అకాడమీని ప్రారంభించారు. పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, గవర్నర్ అబ్దుల్‌నజీర్, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రధాని హెలికాప్టర్లో వచ్చినప్పటికి నాసిన్‌కు నలుదిక్కులా ఉన్న గోరంట్ల, హిందూపురం హైవేకి ఇరువైపులా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వేల సంఖ్యలో పోలీసులు ఈప్రాంతాన్ని రెండురోజులుగా జల్లెడ పడుతూ, భద్రత వలయంగా మలిచారు.

ఆమోదించండి...ప్లీజ్

మోదీ పర్యటన సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎంఎస్ నాయకులు పార్టీ జెండాలు పట్టుకుని నాసిన్ ద్వారం వద్ద ప్రధానికి స్వాగతం పలుకుతూ నినాదాలు చేశారు. వచ్చే పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కెబి. మధుమాదిగ, గంగాధర్, అమర్, మధుసూధన్, కదిరప్ప, లాలెప్ప, దండోరా నారాయణ, సైకిల్ నరసింహులు, ఎన్‌సీ నరసింహులు, నరసింహుడు, కుమారస్వామి, స్వతంత్ర్య కుమారి, శాంతమ్మ తదితరులున్నారు.

ఆలయాన్ని సందర్శించిన తొలి ప్రధాని



లేపాక్షి ఆలయంలో.. ప్రధాని సమక్షంలో శ్రీరామ నామ సంకీర్తనలు



తోలు బొమ్మలాటను చూస్తున్న ప్రధాని

లేపాక్షి, జనవరి 16: చిత్ర, శిల్ప కళల్లో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ సందర్శించి లేపాక్షిని సందర్శించిన తొలి ప్రధానిగా నిలిచారు. ప్రత్యేక హెలికాప్టర్లో మధ్యాహ్నం 1.30గంటలకు లేపాక్షికి వచ్చిన ఆయన కాన్వాయ్‌లో నేరుగా ఆలయానికి చేరుకున్నారు. పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో దుర్గా, వీరభద్రస్వాములకు ఆయన ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడిలో ఏర్పాటు చేసిన రామకీర్తనల కచేరి, తోలుబొమ్మలాటను వీక్షించి, పదినిమిషాలు ధ్యానంలో కూర్చున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, కచేరి నిర్వాహకులను స్వయం గా ప్రధాని అభినందించారు. అక్కడి నుంచి నేరుగా పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన నాసిన్ సభకు తరలి వెళ్లారు.

● **ఆలయ చరిత్రను వివరించిన అధికారులు**

లేపాక్షి సందర్శనకు వచ్చిన తొలి ప్రధాని నరేంద్ర మోదీ. అయితే ఆయనకు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించడంలో అధికారులు విఫలమయ్యారు. వేలాడే స్థంభం, సీతాదేవి పాదం, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాల్సిన అధికారులు ఇవేవి చూపించలేకపోయారు. అధికారులు ఏ ఉద్దేశంతో ఆయనకు చరిత్రను వివరించలేదోనని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యునెస్కో గుర్తింపుకు చేరువలో ఉన్న లేపాక్షి విశిష్టతను ఆయనకు చూపించకపోవడంతో మండిపడుతున్నారు. లేపాక్షికి ప్రధాని రావడం ఆనందకరమని, అయితే చరిత్రను వివరించడంలో విఫలమయ్యారని వాపోతున్నారు.



వీరభద్రుడికి మోదీ హారతి



కార్యకర్తల సందడి

ఆధారేదీ...?

ప్రధాని పర్యటనలో పాల్గొనడానికి వచ్చిన కార్యకర్తలను పోలీసులు ఆధార్ ఉంటేనే పరిశీలించి అనుమతించారు. అయితే కొందరి వద్ద ఆధార్ కార్డు లేకపోవడంతో వారిని అడ్డుకున్నారు. దీంతో వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బీజేపీ జెండాలు, కాషాయం కండువాలు, మోదీ మాస్కులతో వచ్చారు. విధిలేక పోలీసులు వారిని మరో ద్వారం గుండా అనుమతించాల్సి వచ్చింది.



రోడ్డు పక్కనే భోజనం చేస్తున్న పోలీసులు

భో'జనం'..

ప్రధాని పర్యటనకు విచ్చేసిన కార్యకర్తలకు భోజనం దొరకడం ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి బీజే పీ, వీహెచ్‌పీ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, ప్రజలు, అధికారులు నాసిన్ వద్దకు అధిక సంఖ్యలో చేరుకున్నారు. సకాలంలో భోజనం అందక నానా అవస్థలు పడ్డారు. బీజేపీ నాయకులు జోక్యం చేసుకుని భోజనాలు వాహనాలలో తెప్పించి ప్రజల కు, పోలీసులకు పంచి పెట్టారు. అయితే ఆకలి తీరడానికి తోసుకోవాల్సి వచ్చింది. పోలీసులూ రోడ్లపైనే కూర్చొని తినాల్సివచ్చింది.



ట్రా'ఫికర్' తప్పలేదు...

నాసిన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన వారికి ట్రాఫిక్ కష్టాలు చుక్కలు చూపించాయి. ప్రధాన ద్వారం పక్కనే బెల్ కంపెనీకి కేటాయించిన స్థలంలో వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించారు. అయితే ఆ స్థలం సరిపోకపోవడంతో ద్విచక్రవాహనాలు, కార్లు రోడ్డుపైనే పార్కింగ్ చేశారు. పోలీసుల వాహనాలు సైతం రోడ్డు పక్కనే ఉంచాల్సి వచ్చింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరా యం ఏర్పడింది. ప్రధాని పర్యటన ముగిసిన త ర్వాత ఒక్కసారిగా వాహనాలు బయల్దేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అధ్యక్షా..ఇదేం తీరు..!



● పాలకవర్గం వర్సెస్ బ్యూరోక్రసీ ● ఉన్నతాధికారుల వైఖరిపై విమర్శలు ● నేటి జడ్పీ సమావేశంపైనే అందరి దృష్టి

అనంతపురం విద్య, జనవరి 16 : జడ్పీలో మోనార్క్స్ పాలన సాగుతోందా..?, పాలకవర్గాన్ని డమ్మీని చేసే యత్నాలు జరుగుతున్నాయా..?, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి సమావేశం కావాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని..నామమాత్రం నిర్వహిస్తున్నారా.. బ్యూరోక్రసీ వర్సెస్ పాలకవర్గం అన్నట్టుగా మారిందా..? అంటే వీటికి కొంత కాలంగా జడ్పీ ఉన్నతాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు, వారి వైఖరి అవుననే సమాధానం వస్తోంది. దీనికితోడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సైతం తీరికలేని స్థితిలో ఉన్నారు. ప్రజా సమస్యలపై గళం విచ్చేందుకు...కనీసం గంట కూడా జడ్పీ సమావేశానికి కేటాయించలేకపోవడం విచిత్రం.

తీరిక లేని ప్రజాప్రతినిధులు

అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలు కార్పొరేషన్ చైర్మన్లు, చైర్‌పర్సన్లు కనీసం జడ్పీ సమావేశాలకు వచ్చే తీరు కూడా వారిని లేనట్లు కనిపిస్తోంది. జడ్పీ అధికారిక లెక్కల మేరకు 2021లో జరిగిన తొలి సమావేశం(పాలకవర్గం ఎన్నిక) మినహా ఇతర సమావేశానికి సగం మంది కూడా ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. ఇద్దరు ఎంపీలు ఉంటే..రెండు సార్లు మాత్రమే వచ్చారు. శాసన మండలికి వెళ్లే.... ఎమ్మెల్సీలు తీరు కూడా దారుణంగా ఉంది. ఇక కార్పొరేషన్ పదవులను దక్కించుకున్న చైర్మన్లు, చైర్ పర్సన్లు అయితే...చుట్టపు చూపుగా కూడా రావడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరువు, నిరుద్యోగ సమస్యలు తాండ విస్తున్నాయి. మరో 2 లేదా 3 నెల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ కుర్చీల్లో కూర్చున వారికి ఈ సమావేశం బహు శా చివరిది కావచ్చు. ఎన్నికల తర్వాత ఎవరు ఎక్కడ ఉంటారో తెలియ దు. కనీసం చివరి సమావేశానికైనా హాజరవుతారో లేదో వేచి చూడాలి.

అధికారుల తీరుపై గరం..గరం..

గత కొంత కాలంగా జడ్పీలోని కొందరు ఉన్నతాధికారుల వైఖరిపై జడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, జడ్పీటీసీలు గరంగరంగా ఉన్నారు. తమ సమస్యలు వినే వారు లేని, పట్టించుకునే వారు లేరంటూ...మండిపడుతున్నారు. ఇప్పటికే రెండేళ్ల కాలం గడిచిపోయింది, ఏం పనులు చేసుకోలేకపోయామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవలికాలంలో అభివృద్ధి పనులకు, స్థానిక సంస్థల నుంచి తీర్మానాలు తేవాలన్న నిబంధనపై కూడా జడ్పీటీసీలు పెదవి విరుస్తున్నారు. ఈ క్రమంలో 2 సార్లు వాయిదా పడి 4 నెలల తర్వాత బుధవారం జరిగే ఈ సమావేశం రసవత్తరంగా ఉంటుందనడంతో సందేహం లేదు.

సమావేశం నిర్వహించిన తేదీ	హాజరైన జడ్పీటీసీలు	హాజరైన ఎమ్మెల్యేలు	ఎమ్మెల్సీలు	ఎంపీలు
25 సెప్టెంబరు 2021	63	9	2	2
18 డిసెంబరు 2021	62	6	1	1
26 మార్చి 2022	61	2	1	1
23 జూన్ 2022	47	2	1	1
24 సెప్టెంబరు2022	48	2	2	2
7 జనవరి 2023	49	3	1	1
6 మే 2023	48	1	0	0
26 ఆగస్టు 2023	41	0	0	1

ప్రమాదరహిత జిల్లాగా నిలుపుదాం

అనంతపురం కల్చరల్, జనవరి 16: రహదారి నిబంధనలు పాటించి, అనంతను ప్రమాద రహిత జిల్లాగా నిల పాలని జేఎన్‌టీయూ ఓటీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు చేపడుతున్న రోడ్డుభద్రతా మాసోత్సవాల ప్రారంభ సభను సోమవారం అనంతపురం డిపో గ్యారేజీలో నిర్వహించారు. డీఎం నాగభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి దుర్గాప్రసాద్‌తో, ఆర్టీసీ డిప్యూటి సీటీఎం రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మద్యపానం సేవించడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి చేయరాదన్నారు. కార్యక్రమంలో మూడవ పట్టణ ఎస్ఐ గోపాల్, అనంతపురం డిపో అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అనంతపురం విద్య, జనవరి 16: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. మంగళవారం ఉపాధ్యాయభవన్‌లో అనంతపురం, సత్యసాయి జిల్లాల కొత్త కార్యవర్గాల ఎన్నిక కోసం సీఈజార్జ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అనంతపురం జిల్లా అధ్యక్షులుగా మంజుల, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా సరోజిని, కృష్ణ, సుజాత, కవితారాణి, ఉప కార్యదర్శులు చాంద్‌భాషా, కాశమ్మ, శంకర్‌రెడ్డి, ధనలక్ష్మి, రాష్ట్ర కౌన్సిలర్లుగా విజయ్, డానియల్, దౌలత్ ఖాన్‌ను ఎన్నుకున్నా రు. కొత్త కార్యవర్గానికి ఆ సంఘం సభ్యులు, ఇతర యూనియన్ లీడర్లు అభినందనలు తెలిపారు.



మంజుల



పురుషోత్తం

అట్టహాసంగా రాతిదూలం లాగుడు పోటీలు





గెలుపొందిన ఎద్దుల యజమానులకు బైక్‌ను బహూకరిస్తున్న ముఖ్య అతిథులు, పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

అనంతపురం రూరల్, జనవరి 16: మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీలో రాతిదూలం లాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. గ్రామంలో దక్ష కన్‌స్ట్రక్షన్ అధినేత, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలు జాతి రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. సోమవారం న్యూకేటగిరి విభాగంలో, మంగళవారం సీనియర్ కేటగిరి విభాగంలో పోటీలు నిర్వహిం చారు. అదేవిధంగా గుర్రపుస్వారీ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు అనంత వెంటరామిరెడ్డి జడ్పీచైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ తలారి రంగయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహాయ్య హాజరై పోటీలను ప్రారంభించారు. గ్రామంలో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల నుంచి రైతులు, ప్రజలు హాజరయ్యారు. మొదటి రోజు న్యూకేటగిరి విభాగంలో 22జతల ఎద్దులు పోటీ పడగా సి.కొత్తపల్లి, కీర్తిపల్లెకి చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి, భరత్‌కుమార్ యాదవ్ ఎద్దులు మొదటి స్థానంలో నిచాయి. రెండు మూడు స్థానాల్లో నంద్యాల జిల్లా ఎస్‌కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ బీరం సుబ్రమణ్యేశ్వరరెడ్డి, కడప జిల్లా జమ్ములమడుగుకు చెందిన మహేశ్వరరెడ్డికి చెందిన ఎద్దులు విజేతలుగా నిలిచాయి. న్యూకేటగిరి విభాగంలో విజేతకు యూనికార్న్ బైక్ బహూకరించగా..సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అందజేశారు. రెండు విభాగాల్లో మొదటి తొమ్మిది స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతిని అందించారు.



లలితకళా పరిషత్‌లో టీడీపీ నాయకులతో ప్రభాకర్ చౌదరి

టీడీపీ కార్యక్రమాలను జయప్రదం చేయండి : వైకుంఠం

అనంతపురం అర్బన్, జనవరి 16: టీడీపీ కార్యక్రమాలను నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు సమన్వయంతో జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి కోరారు. స్థానిక లలితకళాపరిషత్, గుత్తి రోడ్డులోని జీకేఎం ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతపురం ఐదో రోడ్డులోని సాయి బాబు ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జయహో బీసీ కార్యక్రమం, ఈనెల 18న లలిత కళా పరిషత్‌లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం, సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఈనెల 20న గుత్తి రోడ్డులోని జీకేఎం ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీ సదస్సులను నిర్వహిస్తున్నారు. టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, అనుబంధ విభాగాల నాయకులు ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ప్రభాకర్ చౌదరి కోరారు.

ఆయన వెంట నాయకులు దేవళ్ల మురళీ, ఆవుల కృష్ణయ్య, నారాయణస్వామి యాదవ్, సరిపూటి రమణ, మారుతీకుమార్ గౌడ్, సాలార్ బాషా, సిమెంట్ పోలన్న, సుధాకర్ యాదవ్, డిస్కో బాబు, పోతుల లక్ష్మీనరసింహులు, కురబ నారాయణ స్వామి, జేఎం బాషా, మార్కెట్ మహేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జయహో బీసీ సదస్సును జయప్రదం చేద్దాం

టీడీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న



అనంతపురం అర్బన్, జనవరి 16 : అనంతపురం ఐదో రోడ్డులోని సాయిబాబు ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వ హించే జయహో బీసీ సదస్సును జయప్రదం చేద్దామని టీడీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న అన్నారు. ఈ మేరకు మంగళవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సదస్సుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని, టీడీపీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, తెలుగు మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వెంకటాపురంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, జనవరి 16: మాజీ మంత్రి పరిటాల సునీత స్వగ్రామమైన వెంకటాపురంలో సంక్రాంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 75 మంది మహిళలు పాల్గొన్నారు. పరిటాల సునీత, సోదరుడు బాలాజీ ఆ ముగ్గులను పరిశీలించారు. విజేతలతోపాటు పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులను పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో అందజేశారు.

చిన్నపల్లిలో చోరీ

చెన్నేకొత్తపల్లి, జనవరి 16: మండలంలోని చిన్నపల్లి గ్రామంలో రామయ్యకు చెందిన ఇంట్లో చోరీ జరిగింది. రామయ్య.. కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం బంధువుల గ్రామానికి వెళ్లాడు. తిరిగి చూడగా ఇంటి తాళం పగలకొట్టి ఉండటాన్ని గమనించి.. ఇంటిలోకి వెళ్లి చూశాడు. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు నగలు, రూ.50 వేలు నగదు చోరీ అయినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రా విజయం



విజేతలుగా నిలిచిన ఆంధ్రా పురుషులు, మహిళల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 16: తెలంగాణలోని జనగాంలో ఆదివారం నిర్వహించిన సీనియర్ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రా పురుషులు, మహిళల జట్లు విజేతలుగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి, కేరళ, కర్ణాటక, తమిళనాడు, గోవా పురుషులు, మహిళల జట్లు ఇందులో పాల్గొన్నాయి. ఇందులో ఫైనల్స్‌లో తెలంగాణపై ఆంధ్రా పురుషులు, మహిళల జట్లు గెలిచి విజేతలుగా నిలిచాయి. సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి ఎల్ఆర్ మౌర్య, సీఈఓ ప్రవీణ్ అనోకర్, తెలంగాణ కార్యదర్శి శోభన్, ఏపీ రాష్ట్ర సీఈఓ వెంకటేశులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, కోచ్‌లు బద్రి, సింహాద్రి, లతాదేవి పాల్గొన్నారు.

నాసిన్... ఎన్నికల డ్రామా : ఎమ్మార్పీఎస్



మాట్లాడుతున్న అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, జనవరి 16: నాసిన్ అకాడమి ప్రారంభోత్సవం... నరేంద్రమోదీ, జగన్‌రెడ్డి ఎన్నికల డ్రామా అని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రతినిధి అక్కులప్ప విమర్శించారు. బీజేపీ చేసిన హడావిడి దేశ ప్రధాని స్థాయిని దిగజార్చిందని మండి పడ్డారు. మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ, పీజీలు చేసిన వేలాది మంది రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు ఇన్నాళ్లూ వలసలు వెళ్తున్నా పట్టని ప్రభుత్వాలు.. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇలాంటి దిగజారుడు పనులకు పాల్పడుతున్నాయన్నారు. దళిత, గిరిజనుల సంక్షేమానికి ఏడాదికి రూ.వందల కోట్లను విడుదల చేస్తున్న కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం యథేశ్చగా దుర్వినియోగం చేస్తున్నా సీఎం జగన్‌ను ఎందుకు ప్రధాని నిలువరించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇద్దరూ దొంగలేనని, ఎన్నికల వేళ నాసిన్ డ్రామా ఆడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్‌కుమార్, తిమ్మరాజు పాల్గొన్నారు.

లెనిన్ శతవర్ధంతి పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్, జనవరి 16: లెనిన్ శత వర్ధంతి పుస్తకాన్ని స్థానిక గణేనాయక్ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఆవిష్కరించారు. కార్మిక రంగానికి లెనిన్ అందించిన సేవలు, సోషలిజం ప్రాధాన్యతలను వివరిస్తూ ముద్రించిన ఈ పుస్తకాన్ని లెనిన్ శతవర్ధంతిని పురస్కరించుకుని విడుదల చేశారు. భారతదేశంలో ఆదానీ, అంబానీల ఆస్తులు ప్రపంచ కుబేరుల స్థాయికి పెరగగా.. ప్రజలు మాత్రం ఆకలి, నిరుద్యోగంతో విలవిల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆకలి సూచికలో మనదేశ స్థానం రోజురోజుకూ ఎగబాకుతుండటం సిగ్గుచేటన్నారు. పార్టీల మార్పుతో ప్రజల సమస్యల పరిష్కారం సాధ్యం కాదని, దీనికి అంతిమ పరిష్కారం సమాజాన్ని సమూలంగా మార్చడమేనని అన్నారు. అందుకు సోషలిజమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఆ మార్గాన్ని అనుసరించడానికి మార్క్సిజం సిద్ధాంతాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ఇది సరైన సందర్భమన్నారు. లెనిన్ చూపిన మార్గంలో భారతదేశంలో సోషలిస్టు వ్యవస్థ నిర్మించేందుకు కష్టజీవులందరూ ఐక్యం కావాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

సీఎంను కలిసిన చిత్రా వెంకటేష్



అనంతపురంరూరల్, జనవరి 16: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిత్రా వెంకటేష్ కలిశారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక రాజకీయ పరిస్థితులు, పలు విషయాలను ఆయన.. సీఎం దృష్టికి తీసుకువెళ్లారు.

మరూరులో వైభవంగా పెద్దమ్మ దేవర

రాప్తాడు, జనవరి 16: మండలంలోని మరూరు గ్రామంలో పెద్దమ్మ అమ్మవారి దేవర మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నూతన ఆలయంలో పెద్దమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా పెద్దమ్మ జంతు బలి ఇచ్చారు. గ్రామస్థులతో పాటూ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో మరూరు గ్రామం కిక్కిరిసింది. వెండి గుర్రం ట్రస్ట్ వ్యవస్థాపకుడు బుడగల లక్ష్మీనారాయణ భక్తులకు భోజన వసతి కల్పించారు.





ఘనంగా అయ్యప్ప విగ్రహం ఊరేగింపు

శింగనమల, జనవరి 16: శింగనమలలో మకర సంక్రాంతి సందర్భంగా అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం రాత్రి ఊరేగించారు. శింగనమల చెందిన అయ్యప్ప మాలదారులు, భక్తులు నూతన అయ్యప్ప ఉత్సవ విగ్రహం చేయడంతో ఆ విగ్రహాన్ని సోమవారం రాత్రి ఊరేగించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

అనంతపురం క్రైం, జనవరి 16: నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. అక్క మరణాన్ని జీర్ణించుకోలేక ఓ యువకుడు, తల్లి మందలించిందని క్షణికావేశంలో ఓ బాలిక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కక్కలపల్లి సమీపంలోని బీజేపీ కాలనీకి చెందిన సాయికుమార్(19) చదువు ఆపేసి ఇంటివద్దే ఉంటున్నాడు. ఇతని అక్క ఆరునెలల క్రితం మరణించింది. తరచూ ఆమె గురించే ఆలోచించేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తన ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అలాగే నందమూరినగర్‌కు చెందిన స్నేహిత(17) ట్రిబుల్ ఎస్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంతోనే చదువు ఆపేసింది. సెకండియర్ చదవాలని తల్లి మందలించేది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మనస్తాపానికి గురైన స్నేహిలత క్షణికావేశంతో రాత్రి 8గంటల సమయంలో ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కేసులు దర్యాప్తు చేస్తున్నామని అనంతపురం రూరల్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రాములోరి అక్షింతల పంపిణీ

చెన్నేకొత్తపల్లి, జనవరి 16: మండలంలోని పలు గ్రామాల్లో అయోధ్య రామయ్య అక్షింతలను విశ్వహిందూపరిషత్ సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపినాథ్ స్వామి, వీహెచ్‌పీ జిల్లా సహకార్యదర్శి వేదవ్యాస్, వీహెచ్‌పీ సభ్యులు, న్యామద్దల హిందుదేవాలయ పరిరక్షణ సభ్యులు పాల్గొన్నారు.

శింగనమల : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పెద్ద మట్లగొంది, సోదనపల్లి గ్రామాల్లో రామభక్తులు సోమవారం భజనలు చేస్తూ రామయ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ తర్వాత ఆ అక్షింతలను ఏ విధంగా వాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

మద్యం విక్రేత అరెస్ట్

గార్లదిన్నె, జనవరి 16: మండలంలోని మర్తాడు గ్రామం హెచ్ఎల్సీ కెనాల్ వద్ద మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద ఉన్న 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



శిల్పారామంలో కళాకారుల కోలాటం, నృత్యప్రదర్శన

వైభవంగా సంక్రాంతి

అనంతపురం కల్చరల్, జనవరి 16: జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమ, మంగళవారాల్లో పెద్దఎత్తున సంక్రాంతి, కనుమ వేడుకలను జరుపుకున్నారు. మహిళలు ఇళ్లముంగిట రంగురంగుల రంగవల్లులను వేసి, గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సంక్రాంతిలక్ష్మిని ఆహ్వానించారు. ఆలయాల్లోనూ మకర సంక్రమణ పూజలు, కనుమనాడు గోపూజలను నిర్వహించారు. స్థానిక మూడో రోడ్డులో కృష్ణమఠం వద్ద టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం గోపూజలు నిర్వహించారు. అదేవిధంగా కనుమ సందర్భంగా సాగిన వనవిహారాలు, విందు, వినోదాలతో నగర శివార్లలోని పార్కులు కిక్కిరిసాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా నగరవాసులు శిల్పారామంలో ఉల్లాసంగా గడిపారు. జారుడుబండలు జారుతూ, ఊయలలు ఊగుతూ, బంధుమిత్రులతో కలిసి ఆడుతూ, పాడుతూ చిన్నారులు కేరింతలతో సాగారు. అలా గే పలుప్రాంతాల్లో ఆలయాలలో ప్రత్యేక పూజలు, రథోత్స వాలు నిర్వహించారు. స్థానిక శారదానగర్‌లోని శివబా లయోగి ఆశ్రమంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామిల మూలవిరాట్‌లకు ఫలపంచామృ తాభిషే కాలు చేయడంతో పాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూ జాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవర ణలో స్వామివారి ఉత్సవమూర్తితో పల్లకీసేవ నిర్వహించారు.



శివబాలయోగి ఆశ్రమంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సీకేపీలో చెన్నకేశవస్వామి

శిల్పారామంలో..

అనంతపురం రూరల్: నగర శివారుల్లోని శిల్పారామంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా సాగాయి. సోమవారం, మంగళవారం ఓం సంగీత నృత్య కోళాట శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు కౌసల్య ఆధ్వర్యంలో కళాకారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. పిల్లలు శివ పార్వతుల వేషధారణలో ఇచ్చిన ప్రదర్శనలు చూపర్లను ఆకట్టుకున్నాయి. పిల్లలు, పెద్దలు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ క్రిష్ణప్రసాద్, సినిమా డైరెక్టర్ ప్రణీత్, యాంకర్ రమేష్, భరద్వాజ్ చమన్నూరు, నాగరాజారావు, ఉమారాణి, చంద్రకళ, స్వామిరావు, శిరీష్, తేజోవతి, రాగిణి, మంజుల పాల్గొన్నారు.

సీకేపీలో...

చెన్నేకొత్తపల్లి : మండలంలో సంక్రాంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చెన్నేకొత్తపల్లిలో చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ధనుర్మాస మాసం ఆఖరి రోజున ఆలయంలో స్వామివారిని మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడిగా కాయల సురేష్

శింగనమల, జనవరి 16: శింగనమల తెలుగు యువత అధ్యక్షుడిగా శింగనమల చెందిన కాయల సురేష్‌ను నియమించారు. ఆయనకు మంగళవారం అనంతపురం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు జగన్నాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. దిసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



సురేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు



అవార్డు అందుకుంటున్న భరత్

భరత్‌కు జాతీయ యువ పురస్కారం

అనంతపురం క్లాక్‌టవర్: ఇటీవల నాసిక్‌లో నిర్వహించిన 27వ జాతీయ యువజనోత్సవాల్లో కేంద్ర యువజన క్రీడాశాఖ మంత్రి నిషిత్ ప్రమాణిక్ చేతుల మీదుగా జిల్లాకు చెందిన బిసాటి భరత్ దేశ అత్యున్నత జాతీయ యువ పురస్కారాన్ని అందుకున్నారు. ఉమ్మడి జిల్లాలో యువతకు చైతన్యం, అవగాహన కల్పించడంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భరత్ కీలకంగా పనిచేయడంతో ఈ అవార్డు దక్కింది.



గార్లదిన్నె, నార్పలలో సేకరించిన సంతకాల పత్రాలతో అంగన్‌వాడీల నిరసన

సీఎం కక్షసాధింపు మానుకోవాలి: అంగన్‌వాడీలు

గార్లదిన్నె, జనవరి 16: సీఎం జగన్‌రెడ్డి కక్ష సాధింపు మానుకోవాలని అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణతో సమ్మె చేపట్టారు. తమ సత్తా ఏంటో రానున్న ఎన్ని కల్లో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగ న్వాడీల ప్రాజెక్టు కోశాధికారి లీలావతి, గార్లదిన్నె, కల్లూరు సెక్టార్ల ఫిర్‌దోజ్‌బాను, రాజేశ్వరి, ప్రమీలారాణి, శాంతకుమారి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: అంగన్‌వాడీలు తమ నిరసనను మంగళవారమూ కొనసాగించారు. చెన్నేకొత్తపల్లిలో మోకాళ్లపై నిల్చొని నిరసనను వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

శింగనమల : తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు కనుమ పండుగ రోజైన మంగళ వారమూ నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భారతి, ప్రమీల, రామాంజినమ్మ, ఆదిలక్ష్మి, ఓబుళమ్మ, లక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

నార్పల: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె మంగళవారమూ కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకులు శ్రీదేవి, రేణుక, రామాంజినమ్మ పాల్గొన్నారు.



శింగనమలలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

సీకేపల్లిలో మోకాళ్లపై నిల్చొని..

ప్రేమ తెచ్చిన వివాదం

- ప్రేమికుల కుటుంబాల మధ్య ఘర్షణ
- తొమ్మిది మందికి గాయాలు

అనంతపురం క్రైం, జనవరి 16: ప్రేమ తెచ్చిన తంటా తొమ్మిది మందిని గాయాలపాలు చేసింది. చివరికి ఇరు వర్గాలకు సంబంధించి ఇరవై మందిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక అంబేడ్కర్‌నగర్‌కి చెందిన ఓ యువతి... అదే కాలనీకి చెందిన నూరి అక్క కొడుకు హిందూపురంలో ఉంటున్న అఖిల్ ప్రేమించుకున్నారు. ఈ విషయంలో పెద్ద మనుషులు పంచాయితీ చేశారు. ఆ పంచాయితీలో ఏమీ తేలలేదు. యువతి, యువకుడి వర్గాల మధ్య వివాదానికి కారణమైంది. ఒకరిపై ఒకరు కోపంగా ఉండేవారు. అందరి ఇళ్లు అదే ప్రాంతంలో ఉండటంతో అప్పుడప్పుడు గొడవలు జరుగుతుండేవి. సంక్రాంతి పండుగ సందర్భంగా అఖిల్ అంబేడ్కర్‌నగర్‌లోని తన మామయ్య ఇంటికి వచ్చాడు. సోమవారం బైక్‌లో వస్తుండగా కావాలనే తగిలించాడనే కారణంతో యువతి వర్గీయులు వాదనకు దిగారు. పండుగ కావడంతో ఇరువర్గాల బంధువులందరూ ఆ సమయంలో అక్కడే ఉన్నారు. దీంతో గొడవ పెద్దదైంది. ఇరువర్గాలు రాడ్లు, కట్టెలతో పరస్పరం దాడులకు దిగారు. యువతి తరపున ఆరుగురు, యువకుడి తరపున ముగ్గురు గాయపడటంతో వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒక్కో వర్గానికి చెందిన పది మందికిపైగా కేసు నమోదు చేశారు.

తరిమెలలో గోమాతకు పూజలు



గోమాతకు పూజ చేస్తున్న గ్రామస్థులు

శింగనమల : మండలంలోని తరిమెలలో మంగళవారం కనుమ పండుగ సందర్భంగా గ్రామస్థులు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం సూచన మేరకు గ్రామంలో గోమాతను ఇంటింటికీ తీసుకెళ్లి పూజలు చేయించారు.

వైసీపీ పాలనలో సంక్షోభంలో రాష్ట్రం: కాలవ


గజమాలతో కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, జనవరి 16: వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు విమర్శించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ చేపడుతున్న మన కోసం శీనన్న కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని జాజరకల్లు, హిర్దేహాళ్ గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున, గోవిందనాయక్, తిప్పేస్వామి, శ్రీరాములు, వెంకటేశులు, సోమన్నగౌడ, పంపాపతి, బసప్ప, దుర్గప్ప, తాయప్ప, భీమరెడ్డి, మంజు, మరిస్వామి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మండల వ్యాప్తంగా మంగళవారం కాలవ శ్రీనివాసులు సమక్షంలో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. మండలంలోని ఓబుళాపురం గ్రామంలో 50 కుటుంబాలు, హిర్దేహాళ్ గ్రామంలో 25 కుటుంబాలు, హెచ్ఎస్ తండాలో తొమ్మిది కుటుంబాలు, జాజరకల్లు గ్రామంలో 26కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కండువాలు వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

లో ఓల్టేజీ సమస్య తీర్చా

రాయదుర్గం: టీడీపీ పాలనలో నియోజకవర్గంలో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించి లోఓల్టేజీ సమస్యను తీర్చినట్లు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజీలో భాగం గా డీ.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామంలో టీడీపీ హయాంలో నిర్మించిన 132-33 కేవీ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఆయన 40వ సెల్ఫీ దిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల పాటు రాయదుర్గంలో లోఓల్టేజీ సమస్య రాకుండా తాను ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందలేదన్నారు. అప్రకటిత విద్యుత్‌కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ఈ సమస్యలు తీర్చే సత్తా ఉన్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు.


రాయదుర్గంలో సజ్జరొట్టెలు కాల్చి శిబిరం ముందు ముగ్గులు వేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


గుమ్మఘట్టలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బెళుగుప్పలో నోరు, చెవులు, కళ్లు మూసుకుని నిరసన చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు


గుంతకల్లులో గంజి తాగుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

సమ్మె @ 36 రోజులు

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెకు దిగిన అంగన్‌వాడీ వర్కర్లు మంగళవారం 36వ రోజూ తమ నిరసన కొనసాగించా రు. గుంతకల్లులో గంజి తాగి నిరసన తెలిపారు. బెళుగుప్పలో డిమాండ్లతో కూడిన ముగ్గులు వేశారు. ఇలా పలు ప్రాంతాల్లో సమ్మెను కొనసాగించారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుత్తిలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

యువకుడి ఆత్మహత్య

కుందుర్పి, జనవరి 16: మండలంలోని వడ్డెపాళ్యంకు చెందిన మహేష్ (20) మద్యానికి బానిసై పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... మహేష్ కొన్ని నెలల నుంచి మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు మహేష్‌ను ఈ అలవాటే మానుకోవాలని పలుమార్లు మందలించారు. అయినా మానుకోకపో వడంతో పాటు మరింతగా తాగుడుకు అలవాడు పడ్డాడు. ఈక్రమంలోనే మద్యం మత్తులో గ్రామానికి సమీపంలో ఉన్న తన వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న మహేష్‌ను అటుగా వెళ్లే గ్రామస్థులు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.


మహేష్ (ఫైల్)

తల్లిదండ్రులు మహేష్‌ను వైద్యం కోసం కర్ణాటక ప్రాంతమైన పరశురాంపురం తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం చెలికెర ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చిత్రదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మహేష్ మంగళవారం మృతి చెందాడు. మహేష్ అవివాహితుడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, చిత్రదుర్గం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

దుష్ట పాలనకు చరమగీతం పాడుదాం: ఉమా



ఎన్టీఆర్ భవన్ వద్ద సూపర్‌సిక్స్ పథకాలతో వేసిన ముగ్గు వద్ద ఉమామహేశ్వరనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణదుర్గం, జనవరి 16: సైకో జగన్‌రెడ్డి దుష్ట పాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద సోమవారం సూపర్‌సిక్స్ పథకాలతో తెలుగు మహిళలు వేసిన ముగ్గులు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నారు. అనంతరం అక్కడ సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి పట్టిన కీడు తొలగిపోవాలంటే సైకో జగన్‌రెడ్డిని ఇంటికి పంపించాలని అన్నారు. రాష్ట్రంలో వెలుగులు రావాలన్నా, భవిష్యత్ తరాలు బాగుపడాలన్న చంద్రబాబునాయుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అందుకోసం మనమందరం కలిసికట్టుగా టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగస్థల నటులకు అవార్డుల ప్రదానం

గుంతకల్లుటౌన్, జనవరి 16: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రంగస్థల నటులకు ఎస్వీ స్మారక అవార్డులను మంగళవారం ప్రదానం చేశారు. ఆ అసోసియేషన్ స్థానిక కార్యాయంలో రంగస్థల, సినీ నటుడు ఎస్వీ ప్రసాద్ యాదవ్ వర్ధంతిని నిర్వహించారు. జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి, రచయిత వీ గంగరాజు మాట్లాడుతూ ఎస్వీ ప్రసాద్ యాదవ్ నటించిన చిత్రాలు మరవలేనివన్నారు. అనంతరం రంగస్థల నటులు మొలగవల్లి నరసన్న యాదవ్, సుధాకర్, తలారిరాముడు, మద్దికెర టైలర్ శ్రీరాములుకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ హరిప్రసాద్ యాదవ్, విశ్రాంత తహసీల్దార్లు ఈఓ రాముడు, చలపతి, నాగరాజు, కవి ఈశ్వరప్ప, న్యాయవాది చిన్నయ్య, కళాకారులు పుల్లయ్య, లక్ష్మీపతి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర

బెళుగుప్ప, జనవరి 16: మండలంలోని నరసాపురంలో మంగళవారం గ్రామదేవత మారెమ్మ జాతరను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం గంగపూజ, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి కుంకుమార్చన, తీర్థప్రసాదాల వినియోగంతో జాతర ముగిసింది. వందలాది మంది భక్తులు ఈ జాతరకు తరలివచ్చారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉరవకొండ, జనవరి 16: మండలంలోని కోనాపురం సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామన్న(40) అనే వ్యక్తి మృతి చెందాడు. పాల్తూరు గ్రామానికి చెందిన రామన్న ద్విచక్రవాహనంపై అనంతపురం వెళ్తుండగా కోనాపురం సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

శబరిమలకు ఉచిత బస్సు ఏర్పాటు

యాడికి, జనవరి 16: మండలంలోని టి. కొత్తపల్లి గ్రామానికి చెందిన వేలూరు దేవేంద్రనాయుడు శబరిమలకు వెళ్లే అయ్యప్ప మాలధారులకు ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటుచేశారు. సోమవారం 52మంది మాలధారులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శబరిమలకు వెళ్లే భక్తులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వేలూరు దేవేంద్ర నాయుడు, నాగలక్ష్మీ, పలువురు గురుస్వాములు, మాలధారులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి టీడీపీ నాయకుల చేయూత

యాడికి, జనవరి16: నడవలేనిస్థితిలో ఉన్న ఒక దివ్యాంగుడికి టీడీపీ నాయకులు మూడు చక్రాల కుర్చీ, దుస్తులు, పండ్లు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పిన్నేపల్లి గ్రామానికి చెందిన మహేంద్ర అనే దివ్యాంగుడు కదలలేని స్థితిలో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అతడి ఇబ్బందులు తెలుసుకున్న టీడీపీ నాయకులు బొట్టు శేఖర్, మధురాజు, చంద్రలు మంగళవారం రూ.10వేలు విలువగల మూ డు చక్రాల కుర్చీ, దుస్తులు అందించారు. వారు మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి, క్లాస్ -1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డిల దృష్టికి విషయం తీసుకువెళ్లగా తక్షణమే మహేంద్రకు మూడు చక్రాల ఇవ్వాలని ఆదే శించారని తెలిపారు. వారి ఆదేశాలతో తాము ఈ కార్యక్రమం చేపట్టామ న్నారు.

మోదీ పర్యటనకు వెళ్లిన బీజేపీ నాయకులు


వినాయకసర్కిల్‌లో నినాదాలు చేస్తున్న బీజేపీ శ్రేణులు

రాయదుర్గం, జనవరి 16: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా మంగళవారం రాయదుర్గం నియోజకవర్గ బీజేపీ శ్రేణులు పాలసముద్రం తరలివెళ్లాయి. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధరాదేవి, పట్టణ అధ్యక్షుడు అంబాజీరావుల నేతృత్వంలో వినాయక సర్కిల్ వద్ద నినాదాలు చేస్తూ వాహనాలలో బయలుదేరి వెళ్లారు.

వేతనాలు అడిగితే దౌర్జన్యం

ఉరవకొండ, జనవరి16: ఐదు నెలలుగా రావాల్సిన వేతనాలు, పీఎఫ్ బకాయిలు అడిగినందుకు డీఈ శ్రీనివాసులు తమపై దౌర్జన్యానికి పాల్పడ్డారని శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం కార్మికులు పేర్కొన్నారు. దౌర్జన్యానికి పాల్పడిన డీఈపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్మికులు సోమవారం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. చేయని తప్పును మాపై మోపారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌లో అంతరాయం ఏర్పడడానికి వాల్వ్ క్లోజ్‌లో ఉన్నప్పుడు రన్ చేయడమే కారణమన్నారు. సొల్లాపురం సర్పంచ్ దళిత కార్మికులను దుర్భాషలడారని పేర్కొన్నారు. లైన్ లీక్ కావడానికి కారణం సర్పంచు భాస్కర్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులు కారకులు అని తెలిపారు. వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఉమ్మడిగా.. సంక్రాంతి సందడి


సంక్రాంతి పండుగ సందర్భంగా కలిసిన కుటుంబ సభ్యులు

పండుగ సందర్భంగా ఒకేచోట చేరిన 60మంది బంధువులు

యాడికి, జనవరి16: సాధారణంగా ఆరేడుగురు కుటుంబ సభ్యులు ఒకచోట చేరితేనే సందడిగా పండుగ వాతావరణం నెలకొంటుంది. అటువంటిది మూడు వంశాల వారు, ఒకరితో ఒకరికి బంధుత్వం కలవారు 60మందికి పైగా ఒకేచోట చేరి మూడు రోజులపాటు పండగ వేడుకలు నిర్వహిస్తే నిజంగా సంక్రాంతే. మండలంలోని రాయలచెరువు గ్రామానికి చెందిన మాదాల, మోటుపల్లె, యలమ వంశాలకు చెందిన 60 మంది బంధువులు ఒక్కచోట చేరి సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. వీరు గత 14సంవత్సరాలుగా ఇలా వేడుకలు నిర్వహిస్తుండటం గమనార్హం. కుటుంబ పెద్దలు, వారి కొడుకులు, కుమార్తెలు, మనవళ్లు, ముని మనవళ్లు ఇలా అందరం ఒక్కచోట చేరడం గమనార్హం. జయరాములు, సీతారాములు, రంజిత్‌కుమార్, వెంకటప్పనాయుడు, శారద, రాధ, సులోచన, మాదాల అనిల్, పవన్, మను, రవి తదితర కుటుంబ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. వీరిలో రైతులు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నారు.

జీడిపల్లిలో 0.540 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, జనవరి 16: మండలంలోని బెళుగుప్ప రిజర్వాయర్‌లో 0.540 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు మంగళవారం తెలిపారు. ఇన్‌ఫ్లో 390 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 540 క్యూసెక్కులు ఉన్నట్లు వెల్లడించారు.

తాగునీటి సమస్య తీర్చిన టీడీపీ, జనసేన

బెళుగుప్ప, జనవరి 16: మండలంలోని నరసాపురంలో మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు సొంత ఖర్చులతో ప్రజల దాహార్తి తీర్చారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నీరు అందకపోవడంతో గ్రామంలోని గొల్లలదొడ్డి కాలనీలో ఇబ్బందిపడుతున్నట్లు తెలపడంతో స్పందించి, రెండు ట్యాంకర్ల నీటిని సరఫరా చేశారు.

మహిళ అదృశ్యం

పుట్లూరు, జనవరి 16: మండలంలోని కుమ్మనమల గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ ఇంటిలో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

యల్లనూరు, జనవరి16: మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు. శింగవరం సమీపంలోని నది నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృత్యువాత

గుంతకల్లు టౌన్, జనవరి 16: గుంతకల్లు, గుత్తి రైలు మార్గంలోని తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్‌లో సోమవారం రైలు ఢీకొని బోయ పవన్‌కుమార్ (37) మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు పట్టణంలోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న పవన్ కుమార్ మిల్లు సమీపం వద్ద హమాలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. పవన్‌కుమార్ రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

యాడికి, జనవరి16: మండలకేంద్రానికి చెందిన నారాయణ (70) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు మండలకేంద్రంలోని కోనరోడ్డులో నివాసం ఉంటున్న నారాయణ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవించేవాడు. ఆరునెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండేవాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి, జనవరి 16: యాడికిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.6150 స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. సిబ్బందితో దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

టీడీపీలోకి చేరిక

ఉరవకొండ,జనవరి16: మండలంలోని మోపిడి గ్రామానికి చెందిన పలువురు సోమవారం తెలుగుదేశం పార్టీలోకి చేరారు. టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారిలో సునీల్, సతీష్, సంజయ్, తిప్పన్న, లోకేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు. వీరికి పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నర్రాకేశన్న, మాజీ సర్పంచు గోవిందు, అంగడి ఎర్రిస్వామి, హరి పాల్గొన్నారు.


టీడీపీలోకి చేరిన యువత

మండలంలో జేసీపీఆర్ బస్సుయాత్ర

పెద్దవడుగూరు, జనవరి16: మండలంలో బుధవారం నుంచి 30తేదీ వరకు తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బస్సుయాత్ర చేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి మంగళవారం తెలిపారు. 17న మిడుతూరు, 18న కొండూరు, వీరన్నపల్లి, నాగలాపురం, కొట్టాలపల్లి, 19న గోపురాజుపల్లి, మొలకతాళ్ల, చిత్రచేడు, 20న రాంపురం, రామరాజుపల్లి, గంజిగుంటపల్లి, చిట్టూరు, 21న కండ్లగూడూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, 22న తెలికి, మేడిమాకులపల్లి, చింతలచెరువు, 23న బందార్లపల్లి, బుర్నాకుంట, 24న కోనాపురం, రావులుడికి, 25న మల్లేన్‌పల్లి, ముప్పాలగుత్తి, భీమునిపల్లి, 26న తిమ్మాపురం, వీరేపల్లి, అప్పేచర్ల, 27న ఆవులాంపల్లి, విరుపాపురం, జి. వెంకటాంపల్లి, 28న గుత్తి అనంతపురం, కొత్తపల్లి, కాశేపల్లి, 29న కొండుపల్లి, కదరగుట్టపల్లి, కిష్టిపాడు, 30న లక్షుంపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లో బస్సుయాత్ర ఉంటుందన్నారు. యాత్రలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

స్నేహితుడి కోసం వెళ్తూ మృత్యు ఒడికి..

విడపనకల్లు, జనవరి 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్నేహితుడికి కావాల్సిన వస్తువులు తీసుకెళ్తూ మృత్యుఒడికి చేరిన ఓ మిత్రుడి ఉదంతమిది. ఉండబండ గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈరన్న గాయపడ్డాడు. అతడిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆయన తన స్నేహితుడైన పాల్తూరు గ్రామానికి చెందిన కోట్లో రాముడు(48)కి ఫోన్ చేసి తనకు బెడ్‌షీట్లు, క్యారియర్ తీసుకుని అనంతపురం రమ్మన్నాడు. రాముడు రాత్రి సమయంలో బయల్దేరాడు. ఉరవకొండ మండలం కోనాపురం వద్దకు రాగానే కోట్లో రామున్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం అనంతరం కోట్లో రాముని కుటుంబ సభ్యులు మృత దేహంతో పాల్తూరు పోలీస్ స్టేషన్ చేరుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన స్నేహితుడు ఫోన్ చేసి రమ్మనటం వల్లే అనంతపురం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడని తమకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయమై పాల్తూరు పోలీసులు న్యాయం చేస్తామని తెలపటంతో కుటుంబ సభ్యులు మృతుడికి అంత్యక్రియలు నిర్వహించారు.

అంతకుముందు చీకలగురికి గ్రామానికి చెందిన కురుబ ఈరన్న ఉండబండ నుంచి ద్విచక్రవాహంపై తన సొంత గ్రామానికి సోమవారం బయలుదేరాడు ఉరవకొండకు గడ్డి లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసి వెళ్తున్న సమయంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందకు పడిపోయాడు దీంతో ట్రాక్టర్ ముందు చక్రాలు ఈరన్న కాళ్లపై వెళ్లటంతో ఒక కాలు విరిగింది. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

నెట్టికంటి ఆలయంలో కనుమ గోపూజ


గోపూజను నిర్వహిస్తున్న ఏఈఓ మల్లికార్జున

గుంతకల్లు, జనవరి16: సంక్రాంతి, కనుమను పురస్కరించుకు కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం గోపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానంలో ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో అర్చకులు గోపూజచేశారు. గోమాతకు సారెలను సమర్పించి పూలమాలతో అలంకరించా రు. అలాగే పూర్వాభాద్రా నక్షత్రం సందర్భంగా ఆలయంలోని యాగశాలలో ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తికి తిరుమంజన స్నపనంచేసి, మన్యుశూక్త హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, అర్చకులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో షష్ఠి పూజలు


నాగులకట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు ఇన్‌సెట్‌లో ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరుడు

కళ్యాణదుర్గం, జనవరి 16: సుబ్రహ్మణ్య షష్ఠిని మంగళవారం భక్తులు శ్రద్ధగా జరుపుకున్నారు. కంబదూరు మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఉన్న నాగుల కట్టకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఉదయమే ఆలయంలో మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేపట్టి ఉపవాస దీక్షలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని షష్ఠి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలూరుకోనలో రంగనాథస్వామి కల్యాణం


దేవేరులతో కొలువుదీరిన రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్, జనవరి 16: మండలంలోని ఆలూరుకోనలో ధనుర్మాసం చివరిరోజును పురస్కరించుకొని సోమవారం శ్రీదేవిభూదేవి సమేత రంగనాథ స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి కల్యాణం జరిపించారు.

నందీశ్వరుడికి అభిషేకం

తాడిపత్రిటౌన్, జనవరి16: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన నందీశ్వరునికి సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో బుగ్గరామలింగేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లకు నాగపడిగ, వెండి ఆభరణాలతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని, నందీశ్వరున్ని దర్శించుకొన్నారు.


విశేష అలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు